

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒకరకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరిదేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశిక గా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచారవ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచిచూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

### అరుగు మీద సత్యం గారు

**సత్యం** గారు నల్లగా పొట్టిగా ఉండి పెద్ద పెద్ద నిచ్చెనలూ అవీ వేసుకుని కరంటు స్తంభాలు ఎక్కి ఏవో పనులు చేస్తూ ఉంటారు. దాన్నే 'లైన్ మాన్' అంటారని మా ఊర్లో అందరికీ తరవాత తెలిసింది. ఆయన ఎప్పుడు నిద్ర లేస్తారో ఎవ్వరికీ తెలీదు, ఎందుకంటే తెల్లవారేసరికి శుభ్రంగా స్నానం చేసి సంధ్య వార్చుకుని ఉంటారు. డ్యూటీ ఉన్నప్పుడు పొద్దున్నే వెళ్ళిపోతారు సైకిల్ వేసుకుని. సాయంత్రం రాగానే, ఎవరింటినించైనా పేపర్ తెచ్చుకుని తన అరుగు మీదో లేకపోతే ఎదురింటి రాముడు గారిదో, పక్కింటి మాస్టరు గారి అరుగు మీదో కూర్చుని తీరిగ్గా పేపరు మొదట్నించీ చివరిదాకా అక్షరం కూడా వదలకుండా చదివేస్తారు. డ్యూటీలో లేకపోతే ఎవరిదో ఒకరి అరుగుమీద ఉంటారనే అయన్ని అందరూ 'అరుగు మీద సత్యం గారు' అంటారు. ఎవ్వరింట్లో కరంటు పోయినా సత్యం గారు వచ్చి బాటరీ లైటు వేసుకుని 'ఫీజు' (ఫ్యూజ్) పోయిందేమో చూడవలసిందే! పాపం ఆయన కూడా ఎప్పుడూ విసుక్కోకుండా ఎంత రాత్రైనా సరే తప్పకుండా చూసి, తనకి వీలైనంత పని చేసి పెడతారు. పెళ్ళిళ్ళయినా, పేరంటాలైనా, వడ్డనకీ, సహాయానికీ ముందే ఉంటారు. అంతే కాదు, పాముల్ని చంపడంలో ఆయనకు వున్న నేర్పు చెప్పనలవి కాదు. ఎవరింట్లోకైనా పాము వస్తే పెద్ద దుడ్డుకర్ర పెట్టి వడుపుగా కొట్టి దాన్ని చంపే నేర్పు అగ్రహారానికెల్లా ఒక్క సత్యం గారికే ఉంది. అంతటి ధైర్యం ఆ మనిషికి. అంతంత పెద్ద కరంటు స్తంభాలు ఎక్కేయడం వల్లనైతేనేమి, పాములు చంపేయడంవల్లనైతేనేమీ, ఊరిలో పిల్లలందరికీ సత్యం గారో పెద్ద హీరో. 'మా అరుగు మీద సత్యం గారైతేనా పెద్ద తాచు పాముని కూడా ఎంత వీజీగా చంపేస్తారో!' అని పిల్లలందరూ గొప్పలు చెప్పుకుంటారు చుట్టుపక్కల ఊళ్ళలోని తమ స్నేహితులతో.

సత్యం గారి భార్య సూర్యకుమారి గారు. తెల్లగా, చక్కగా, పెద్ద వాలు జడ వేసుకుని ఎప్పుడూ నవ్వుతూ ఉంటారు ఆవిడ. ఇంటి పని అయిపోయాకా, చుట్టుపక్కల ఆడపిల్లలని చేర్చి కొత్త ముగ్గులూ, లేకపోతే గంగా గౌరీ సంవాదం, సీతమ్మ పెళ్ళి, అప్పగింతల పాటలు, ఇలాంటి వన్నీ నేర్పిస్తూ ఉంటారు. అందుకే సాయంత్రం అయ్యేసరికి ఆడపిల్లలందరూ పెనిసిళ్ళూ, పుస్తకాలు

పట్టుకుని తయారయిపోతారు. సత్యం గారికి ముగ్గురు ఆడపిల్లలూ, ఇద్దరు మొగ పిల్లలూ. పెద్ద అమ్మాయికి పెళ్ళి అయ్యింది, అల్లుడు రామచంద్రపురంలో వ్యాపారం చేస్తాడు. సత్యం గారికి సూర్యకుమారి గారంటే ప్రాణం. ఎప్పుడూ 'సూర్యం' అని పిలుస్తూ ఎంతో ప్రేమగా చూసుకుంటారు. ఉన్న మూడుగదులు, వసారా ఇంటిని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకుని ఉన్నంతలో ఎప్పుడూ సంతోషంగా ఉంటారు వాళ్ళిద్దరూనూ.

'ఓ పేపరు కొనుక్కోరాదుటండీ సత్యం గారూ?' అని ఎవరైన వేళాకోళంగా అన్నా ఆయన నవ్వేస్తూ, 'నేను పేపరు కొంటే మాత్రం, వార్తలు అవే కదండీ, కొత్తగా ఉంటాయా? పోనీ, మీరందరూ చదివాకే ఇవ్వండి. పొద్దుటికీ రాత్రికీ వార్తలు మారిపోవు కదా!' అంటారు.

ఆయన మహా కులాసా మనిషి. రేపెలా జరుగుతుందన్న బెంగ లేదు అతనికి. 'నారు పోసిన వాడే నీరు పోస్తాడు కదండీ! మనదేముందీ!' అంటారు.

పిల్లల్నీ, భార్యనీ ఎంతో అపురూపంగా చూసుకుంటారు.

ఓరోజు రాత్రి తాసిల్దార్ గారింట్లో పాము దూరింది. వాళ్ళ చిన్నవాడు కొండ, తోటలోకి వెళ్ళి వస్తూ, దాని తోక తొక్కాడుట. అది సర్రున లేచి బుస్సుమంది. అయితే కరవలేదు, అదృష్టం. కానీ పాముని అంత దగ్గరగా చూసేసరికి భయపడి పోయాడు. దడుపు జ్వరం పట్టుకుంది. ఒళ్ళు నువ్వు గింజ వేస్తే పేలిపోయాలా కాలిపోతోంది. పాము మంత్రం వేసే గుడి పూజారి గవరయ్య గారు వచ్చి మంత్రం వేసి బొట్టు పెట్టారు. మంత్రించిన కందులూ, నువ్వులూ అతని మంచం చుట్టూనూ, పెరటి గుమ్మం దగ్గరా చల్లారు. బొత్తిగా ఆర్.ఎం.పీ డాక్టర్ కూడా లేని ఆ ఊరిలో ఇలాంటివే వైద్యాలు. అయితే పాము కొండని వెదుక్కుంటూ వచ్చి పెరటి గుమ్మంలో తిష్ట వేసింది. దాని బుసలు విన్నకొలదీ కొండకి దడుపూ, జ్వరం ఎక్కువవుతున్నాయి. ఇంకేముందీ! 'అరుగు మీద సత్యం గారికి కబురు పెట్టండ్రా!' అన్నారు. తాసిల్దారుగారు కొడుకు పరిస్థితి చూసి కరిగి నీరైపోతూ, 'వద్దు వద్దు నేనే వెళ్ళి పిలుచుకుని వస్తాను' అన్నారు. పాము పగబట్టడం నిజం కాదని మనకిప్పుడు తెలిసినా, అప్పుడు మాత్రం అది కొండ మీద పగ పట్టిందనీ, అందుకే అతను పడుక్కునే గదికి దగ్గరగా ఉన్న పెరటి గుమ్మం దగ్గరే కాపు కాసిందనీ అందరి విశ్వాసం. దానికి తోడు, కొండ కి పలవరింతలూ, ఫిట్స్ లాగా రావడం కూడా మొదలయ్యేసరికి గవరయ్య గారు పాముని కొట్టి వాడికి చూపించడమే మార్గమని, లేకపోతే పిల్లాడు దక్కడం కూడా అనుమానమేనని భయపెట్టడంతో అందరికీ భయం వేసింది. కొండ తల్లి రుక్మిణమ్మ గారు మొక్కుతున్న మొక్కులకు అంతే లేదు.

'పొద్దుటివరకూ ఆగుదామండీ! చీకట్లో పక్కన ఇంకా పాములు ఉంటే మళ్ళీ కష్టం 'అన్నారు సత్యం గారు చేతులు నులుముకుంటూ. తాసిల్దారు గారేమో 'పిల్లాడేమో భయపడిపోతున్నాడు. ఒక్కసారి చూడండి' అని ఒకటే బతిమాలుతున్నారు. సత్యంగారంతటి ధైర్యవంతుడూ ఎందుకో జంకడం చూసి దీక్షితులు గారు అన్నారు. 'పోనీ పొద్దున్నే చూద్దాంలెండి శాస్త్రి గారూ' అని.

తాసిల్దారు గారిలోని తండ్రి తల్లడిల్లి పోతున్నాడు. 'లాభం లేదండీ, పిల్లాడేమో బెదిరి పోతున్నాడు. ఈ రాత్రికి దాని సంగతి తేల్చకపోతే నా కొడుకు నాకు దక్కేట్టు లేడు, మా ఆడవాళ్ళని పట్టుకోలేకపోతున్నాం', అంతటి మనిషి ఏడుపొక్కటే తక్కువగా ఉన్నాడు.

అయినా సత్యం గారు కదలలేదు, ఆలోచనలోనే ఉన్నారు.

'బాబ్బాబు! సత్యం గారు! నా బిడ్డని బతికించండి, ఇవి చేతులు కావు! ' అని కళ్ళనీళ్ళ పర్యంతం అవుతూ కూర్చుండిపోయారు.

ఇంతలో లోపలనించి వచ్చారు సూర్య కుమారిగారు. 'ఎప్పుడూ లేనిది పాముని కొట్టడానికి మీకు ఇంత ఆలోచన ఏమిటండీ? పదండి, నేనూ వచ్చి రుక్మిణమ్మగారిని ఓసారి చూసి వస్తాను మీతో పాటు' అని లాంతరు వెలిగించి సత్యంగారి చెయ్యి పట్టుకుని తాసిల్దార్ గారింటి వైపు నడిచిందావిడ.

అలా 'లచ్చి వెంట హరి ' నడిచినట్టు ఆవిడ వెనకే సత్యం గారు, తాసిల్దార్ గారు, దీక్షితులు గారు వగైరాలు నడిచి తాసిల్దారిగారింటికి చేరడమూ, సూర్యకుమారి గారు చూపించిన లాంతరు వెలుగులోనే, ఒక చేయి ఆవిడ చేతిలో ఉండగానే సత్యం గారు పెద్ద దుడుకర్రతో మూడు దెబ్బల్లో అంత లావు త్రాచునీ చంపేసి, దాన్ని కొండ కి చూపించాకా, దెబ్బకి వాడి జ్వరం తగ్గి హాయిగా పడుక్కోవడం జరిగాయి. 'ఎలాగయినా సత్యం గారు లెక్కల్లో మనిషి, ఆయన తలుచుకుంటే ఈ పామొక లెక్కా? మా వంశాంకురాన్ని నిలిపిన దేవుడు ' అని తాసిల్దార్ గారు, రుక్మిణమ్మగారు దండాలు పెట్టారు. మర్నాడు సత్యం గారి దంపతులని ఇంటికి పిలిచి భోజనాలు, బట్టలూ పెట్టారు.

అంత లావు పామునీ అవలీలగా కొట్టేసిన సత్యం గారు ముందు ఎందుకు సందేహించారో, పరీక్షగా చూస్తే కుమారి గారు పట్టుకున్న ఆయన చేతిలో సన్నటి వణుకెందుకో, ఊరివాళ్ళెవ్వరూ అడగలేదు, అసలు గమనించలేదు. అడిగితే తెలిసేది- హనుమంతడంతటి సత్యం గారికి చిమ్మచీకటి అంటే భయం అని, ఆయన రాత్రి పొరపాటున పెరట్లోకి వెళ్ళాలన్నా సూర్యకుమారి గారు లాంతరు తీసుకుని తోడు వెళతారనీ, ఆవిడ తోడు లేకపోతే ఆయన రాత్రుళ్ళు చిమ్మచీకట్లో పెరట్లోకి వెళ్ళనే వెళ్ళరనీ. ఆ రాత్రి పూట, సూర్యకుమారి గారు మగవాళ్ళతో సమానంగా తాసిల్దారి గారింటికి వెళ్ళడాన్నీ, లాంతరు పట్టుకొని పాముని కొట్టేటప్పుడు కూడా సత్యం గారి పక్కనే ఉండడాన్నీ మాత్రం ఊర్లో వింతగా చెప్పుకున్నారు కొంతకాలం.

ఓరోజు సాయంకాలం దీపాలు పెట్టేవేళ సూర్యకుమారి గారు తన పొడవాటి జుట్టు కి సున్నితంగా నూనె రాసుకుంటున్నారు పెరటిగుమ్మంలో కూర్చుని.

కరణం గారి బాబి చటుక్కున పరుగెత్తుకుని వచ్చి 'అరుగు మీద సత్యం గారున్నారాండీ? మా తాతగారు కేకేస్తున్నారు!' అన్నాడు.

'అరుగుమీద సత్యంగారేమిట్రా? వెధవన్నా! మావయ్యగారు అనలేవు? నువ్వేం ఆయనకి బొడ్డు కోసి పేరు పెట్టావా? ' అని ముద్దుగా వాడిని కసిరి, 'లేరురా, పని మీద బయటకి వెళ్ళారు కానీ, రాగానే రమ్మంటాలే! ' అన్నారు ఆవిడ.

'సీతమ్మ చేతిలో చుక్క పొడిచిందీ!' అని కూని రాగం తీసుకుంటూ. 'సరేనండీ! ' అని తుర్రుమన్నాడు వాడు.

పది నిముషాలు అయిందో లేదో, మళ్ళీ వచ్చాడు. 'మరేమోనండీ, అత్తయ్యగారండీ, మా తాతగారు 'అరుగు మీద' అదే మావయ్యగారిని అర్జంటు గా రమ్మన్నారండీ! మా ఇంట్లో ఏ దీపాలూ వెలగడం లేదు మరి! ' అన్నాడు.

'లేరని చెప్పను కదరా! రాగానే పంపిస్తాలే' అన్నారావిడ, తన పెద్ద జడని ముందుకు వేసుకుని అల్లుకుంటూ.

బాబిగాడో చిచ్చర పిడుగు. 'మరి సైకిల్ ఉంది కదండీ! 'అన్నాడు.

'సైకిలు మీద కాకపోతే వెళ్ళలేరా? ఎవరో స్నేహితుడు వస్తే కలిసి వెళ్ళారు. అందావిడ' కొద్దిగా విసుగ్గా.

బాబి గాడి కేదో అనుమానం. 'వంటిట్లోంచి ఘుమ ఘుమా వాసనలు వస్తున్నాయి. ఈవిడేమో తీరిగ్గా కూర్చున్నారు ' అనుకున్నాడు.

పిట్టలా తుర్రుమన్న వాడు మళ్ళీ పది నిముషాలలో పరిగెత్తుకుని వచ్చాడు.

అయితే సూర్యకుమారి గారు వీధి గుమ్మం తుడుస్తూ కనిపించారు.

ఆవిడ కంట పడకుండా పిల్లిలా నక్కి, వాళ్ళ ఇంటి వెనక పక్కకి వెళ్ళాడు.

పెరటి అరుగు మీద ఎవ్వరూ లేరు, మెల్లగా వంటింట్లోకి తొంగి చూసాడు.

పొయ్యి మీద పెద్ద మూకుడు పెట్టి వేడిగా జంతికలు వండుతున్నారు అరుగు మీద సత్యం గారు. పెద్ద డబ్బా నిండా తయారయిన జంతికలు ఉన్నాయి.

తూనిగలా తుర్రుమన్నాడు బాబి. ఇంకేముందీ! పట్టుమని పాతిక గడపలు లేని అగ్రహారం లో తెల్లరేసరికల్లా 'సూర్యకుమారి గారికి అరుగు మీద సత్యం గారు జంతికలు వండి పెడతారు' అని ప్రచారం అయిపోయింది.

'బొత్తిగా ఆడంగి వేషాలు కాకపోతే మగాడయివుండీ జంతికలు వండడవేమిటీ? ' అని మగవాళ్ళు సాగతీసారు.

ఆడవాళ్ళు మాత్రం 'సూర్యకుమారి అదృష్టవంతురాలు, కూర్చోపెట్టి చేసే మొగుడు అందరికీ దొరుకుతాడా?' అనుకున్నారు.

మూడో కూతురు పుట్టినప్పుడు సూర్యకుమారి గారికి నరాల వాతం కమ్మి చేతి వేళ్ళు పట్లు తప్పడంతో ఇలాంటి పనులు చెయ్యలేరు ఆవిడ. అందుకే ఊరు తెల్లారకుండానే లేచి ఇంటికి కావలసిన మంచి నీళ్ళన్నీ సత్యం గారే మోస్తారు. సాటి ఆడవాళ్ళతో నీళ్ళకి సూర్యకుమారి పేరుకు మాత్రం వెళ్ళి ఓ అరబిందెడు నీళ్ళు మాత్రం తెచ్చుకుంటారు ఎసట్లోకి అంటూ. 'నూతి నీళ్ళకి పప్పు ఉడుకుతుందా? ' అని ఎవరైనా అడిగితే, 'మా ఇంట్లో బాగానే ఉడుకుతుందే! ' అంటారావిడ ముసి ముసి గా నవ్వుతూ.

అయితే ఊరిలో ఎవరేమనుకున్నా సత్యం గారికి సూర్యకుమారి గారి ఆరోగ్యం కంటే ఎక్కువేమీ కాదు. ఆయన జంతికలు వండుతూనే ఉన్నారు. తెల్లారకుండానే ఆవిడకి ఇంట్లోకి కావలసిన నీళ్ళన్నీ గోదావరి నించీ మోసుకొస్తూనే ఉన్నారు, కుంపట్లో పప్పు ఉడకడానికి పోసే నీళ్ళతో సహా.

అలా ఆయన చిమ్మచీకటి భయానికి ఆవిడ, ఆవిడ నరాల బలహీనతకు ఆయన కాపుగా, దాపుగా ఉంటారని ఊరిలో తెలియదు.

*భాగస్వామిలో లేని గుణాలని ఎత్తిచూపించుకుంటూ వాదులాడుకోవడం వాళ్ళకి తెలీదు. చేతిలో చేయి వేసి ఏడడుగులు నడిచిన నాటినించీ, నాలో చివరి శ్వాస వరకూ 'నీ బలహీనత నాది, నా బలం నీది ' అని చేసుకున్న ప్రమాణాలకి ప్రతీకగా వారిద్దరూ గడిపిన అందమైన దాంపత్య జీవితం అందరూ దాచుకోవలసిన పెళ్ళిపుస్తకం.*

